## క్లుప్తంగా

### నేడు మతసామరస్యంపై సదస్సు

కర్నూలు కల్చరల్: మహాత్మా గాంధీ 154వ జయంతిని పురస్కరించుకుని సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళా క్షేత్రంలో 'వర్తమన పరిస్థితులు – మత సామరస్యం– ఆవశ్యకత' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు కేంద్ర కన్వీనర్ జె.ఎన్. శేషయ్య తెలిపారు. మాజీ శాసన మండలి సభ్యులు సైన్స్ ఉద్యమ నాయకులు విఠపు బాలసుబ్రహ్మణ్యం ముఖ్య వక్తగా హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

### ప్రవక్త మార్గం అనుసరణీయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సయ్యద్ షా ముబష్షిర్ పాషా ఖాద్రీ

కర్నూలు(రాజ్‌విహార్): మహమ్మద్ ప్రవక్త అనుసరించిన, చూపిన మార్గం ఎంతో ఉత్తమమైందని సయ్యద్ షా ముబష్షిర్ పాషా ఖాద్రీ అన్నారు. ఆదివారం రాత్రి అఖర్ షా మౌలా దర్గాలో ఈద్ మిలాద్ ఉన్ నబీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవక్తలు ఎందరున్నా.. మహమ్మద్ ప్రవక్త కోసమే ఈ ప్రపంచాన్ని అల్లాహ్ సృష్టించారని చెప్పారు. అల్లాహ్ సూచించిన శాంతి, సోదరాభావం, ఓర్పు, సహనం, అత్యంత సాధారణ జీవనం, ఆడ పిల్లల పట్ల బాధ్యత, తోటి వారి పట్ల ప్రేమ, అప్యాయతలు ఎలా చూపాలో నేర్పారని వెల్లడించారు. దీనితో పాటు మరణం తరువాత స్వర్గం పొందేందుకు ప్రతి ముస్లిం చేయాల్సిన మార్గాలు చూపారన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మహబూబ్ బాషా, ఉర్దూ అకాడమి డైరెక్టర్ నూరుల్లా, ఇతర మైనారిటీ సంఘాల ప్రతినిధులు, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### మహానంది భక్తజనసంద్రం

మహానంది: వరుస సెలవులు కలిసిరావడంతో మహానంది ఆలయం ఆదివారం భక్తజనసంద్రంగా మారింది. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం సుప్రభాత సేవ, అష్టవిధ మహామంగళ హారతుల సమయం నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవారి దర్శనం రాత్రి ఏకాంతసేవ వరకు నిర్విరామంగా కొనసాగింది. ఆర్జితసేవాటికెట్లు, అభిషేకాలు, ప్రసాదాల విక్రయం, ఇతర విభాగాల ద్వారా సుమారు రూ. పది లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు సమాచారం.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వెలుగోడు: పట్టణంలోని శ్రీ నీలం సంజీవరెడ్డి డిగ్రీ కాలేజీ 2005–2008 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సుమారు 15 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకేచోట చేరి ఆనందంగా గడిపారు. కళాశాల అభివద్ధికి కృషి చేయడంతో పాటు తోటి విద్యార్థులకు ఉపయోగపడాలని తీర్మానాలు చేసుకున్నారు. రిటైర్డు ప్రిన్సిపాల్ రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి దశ మరువలేనిదన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ అల్లె శంకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ హైమావతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు ఆదివారం విరాళాలు అందజేశారు. తెలంగాణరాష్ట్రం సిద్దిపేటకు చెందిన ఇ.సాయికృష్ణ శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకున్న అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళాన్ని ఏఈవో ఫణిధర ప్రసాద్‌కు అందజేశారు. అలాగే కర్నూలుకు చెందిన ఎం.విజయభాస్కర్ దంపతులు రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలు హిమబిందుకు అందజేశారు. విరాళాలు అందించిన దాతలకు దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

### ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలకం



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభిస్తున్న రామకృష్ణ మఠం స్వామీజీలు

కర్నూలు కల్చరల్: ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని కడప రామకృష్ణ మఠం కార్యదర్శి అనుపమానంద మహరాజ్, సన్నివాసానంద మహరాజ్ అన్నారు. శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఉపాధ్యాయుల సమ్మేళనం జరిగింది. 'సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర' అనే అంశంపై వారు ఉపన్యసించారు. ఉపాధ్యాయులు తమ వృత్తిని దైవంగా భావించి బోధన చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శకులు ఉపాధ్యాయులే అన్నారు. వివేకానంద భావ ప్రచార పరిషత్ రాయలసీమ విభాగం కన్వీనర్ డాక్టర్ త్రిశూల పాణి, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు టి.డి. హుసేన్ పిరాన్, కార్యదర్శి డాక్టర్ కె.జి. శరత్ చంద్ర, జిల్లా కోఆర్డినేటర్ ఎల్.సుధాకర్ మాట్లాడారు.



ఆర్‌యూలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో విద్యార్థులతో వీసీ, రిజిస్ట్రార్,



ఉర్దూ వర్సిటీలో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు



ట్రిపుల్ ఐటీలో..



మాజీ సైనికుల ఆధ్వర్యంలో..

# స్వచ్ఛతలో అగ్రస్థానం సాధిద్దాం

- నగర ప్రజలకు మేయర్ బీవై రామయ్య పిలుపు
- తుంగభద్ర నది పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు
- చీపురు పట్టిన మేయర్, కమిషనర్

కర్నూలు (టౌన్): క్లీన్ అండ్ గ్రీన్‌లో రెండో స్థానంలో ఉన్న కర్నూలు నగరాన్ని మొదటి స్థానంలోకి తీసుకెళ్దామని నగర మేయర్ బీవై.రామయ్య పిలుపు నిచ్చారు.ఇందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు స్వచ్ఛతా హీ సేవ– స్వచ్ఛత కోసం ఒక గంట కార్యక్రమం పేరుతో నగరంలోని పవిత్ర తుంగభద్ర నది వెంట పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. మేయర్, కమిషనర్, అడిషనల్ కమిషనర్లు చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. చెత్త చెదారాన్ని తొలగించారు. గంట సేపు నది పరిసర ప్రాంతాల్లో నగరపాలక కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, సచివాలయాల ఉద్యోగులు, విద్యార్థినీ విద్యార్థులు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో చెత్త సేకరణలో ఎన్నో మార్పులు తీసుకువచ్చామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో క్లీన్ అండ్ గ్రీన్‌కు ప్రాధాన్యత ఇచ్చి చెత్త లేని నగరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం పేరుతో సంకల్‌బాగ్, తుంగభద్ర నది తీరంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. తడి, పొడి చెత్తను వేరు చేయాలని, రోడ్లపై చెత్త వేయకుండా ఇంటికి వచ్చే వాహనాలకు అందించాలన్నారు. ఇప్పటికే చెత్త డిబ్బలు లేని నగరాన్ని తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, అర్షియా ఫర్హీన్, షేక్ నీలోఫర్ కార్పొరేటర్లు సిత్రా సత్యనారాయణమ్మ, గాజుల శ్వేతారెడ్డి, విక్రమ సింహారెడ్డి, మున్సిపల్ ఈఈ శేషసాయి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

**సమాజ సేవలో యువత ముందుండాలి**

కర్నూలు (న్యూసిటీ) : యువత సమాజ సేవలో ముందుండాలని రాయలసీమ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం యూనివర్సిటీలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యం బాగుంటుందన్నారు. జాతీయ సేవా పథకం యువతను సమాజ సేవలో చైతన్యపరచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందని చెప్పారు. ఆరోగ్యం–పరిశుభ్రత– స్వచ్ఛత తదితర అంశాలను పాఠశాలల్లోనే విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు వర్సిటీ ఆవరణలో ఉన్న చెత్త, పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు, ప్రిన్సిపాళ్లు ఎస్‌టీకే నాయక్, హరిప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ అరుణ, అధ్యాపకులు నాగచంద్రుడు, శివప్రసాద్, విజయుడు పాల్గొన్నారు.

**ట్రిపుల్ ఐటీలో శ్రమదానం**

కర్నూలు సిటీ: నగర శివారులోని జగన్నాథగట్టుపై ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ డిజైన్, మాన్యుఫాక్చరింగ్(ట్రిపుల్ ఐటీడీఎం)లో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఆ సంస్థ డైరెక్టర్ ఆచార్య డీవీఎల్ఎన్ సోయమాజులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డైరెక్టర్‌తో పాటు, జిల్లా క్షయవ్యాధి నియంత్రణ విభాగం రిటైర్డ్ అధికారి మోక్షేశ్వరుడు పాల్గొని క్యాంపస్‌లోని వివిధ భవనాల ఆవరణాలను పరిశుభ్రం చేశారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్స్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీడీఎం ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ అసోసియేట్ డీన్ డా.పి రంగబాబు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

**ఉర్దూ వర్సిటీలో..**

కర్నూలు (న్యూసిటీ) : డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు శ్రమదానం చేసినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జేఎండీ షఫీ తెలిపారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు వర్సిటీ ప్రాంగణంలో గడ్డి మొక్కలు, చెత్త వ్యర్థాలను తొలగించారు.

**మాజీ సైనికుల ఆధ్వర్యంలో శ్రమదానం**

కర్నూలు (అర్బన్) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ఆదివారం మాజీ సైనికుల జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక బీ. క్యాంప్‌లో నిర్వహించారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా జిల్లా డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా కమిటీ పేర్కొంది.



తుంగభద్ర నది పక్కన రహదారిని శుభ్రం చేస్తున్న మేయర్ బీవై రామయ్య, అధికారులు, కార్పొరేటర్లు

# పేదల ఆరోగ్యానికి సీఎం పెద్దపీట



రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో నియోజకవర్గంలోని 8 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) కింద మంజూరైన రూ. 17,75,000 చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వర్తించని వ్యాధులకు ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ కింద ఆర్థిక సహాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ క్లస్టర్–2 అధ్యక్షుడు( కార్పొరేటర్ ) శ్రీనివాసులు నియోజకవర్గంలోని నాయకులు పాల్గొన్నారు.

**రైతుల సంక్షేమమే ధ్యేయం**

రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురం గ్రామంలో రైతులకు సబ్సిడీపై శనగ జేజీ–11 రకం విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని ముఖ్య అతిథిగా హాజరై విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కోరిక మేరకు ఈ ఏడాది రబీ సీజన్‌లో శనగ రాయితీ విత్తనాలను పెంచామన్నారు. సబ్సిడీ కూడా 40 శాతం ఇస్తున్నామన్నారు. క్వింటా శనగ ధర రూ. 8,100 కాగా 40 శాతం సబ్సిడీ పోగా రూ. 4,860 చెల్లించాలన్నారు. ఎకరాకు 40 కిలోల శగన విత్తనాలు అందిస్తున్నామన్నారు. విత్తనాలు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వీఏఏ/వీహెచ్‌ఏలను కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నారాయణరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, నాయకులు సత్యంరెడ్డి, మాజీ సర్పంచ్ బాబు, నడిపెన్న, కృపానందం, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

# బొప్పరాజు వెంకటేశ్వర్లుకు అభినందనలు



బొప్పరాజు వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న జిల్లా ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన బొప్పరాజు వెంకటేశ్వర్లును జిల్లా ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం నాయకులు సత్కరించారు. ఐదోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన బొప్పరాజు వెంకటేశ్వర్లును విజయవాడలో జిల్లా నాయకులు అబ్దుల్ హమీద్, ఇలియాస్‌బాషా, మునీర్ తదితరులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా శాలువ, పూలమాలలతో సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొనే వివిధ సమస్యల పరిష్కారానికి బొప్పరాజు వెంకటేశ్వర్లు తీసుకున్న చొరవ అభినందనీయమని జిల్లా ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం మాజీ అధ్యక్షుడు సర్దార్ అబ్దుల్‌హమీద్ తెలిపారు.

# పోషకాల ఆవశ్యకతపై అవగాహన అవసరం

- పోషక లోపాలను సకాలంలో నివారించుకోకపోతే పంట దిగుబడులపై ప్రభావం
- కలికిరి ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శాంతకుమారి సూచనలు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ శాంతకుమారి

కర్నూలు(అగ్రికల్చర్): వివిధ పంటల్లో సూక్ష్మ, స్థూల పోషకాలు, వాటి ఆవశ్యకతపై అవగాహన పెంచుకుని రైతులకు సమగ్రంగా తెలియ జెప్పాలని కలికిరి ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.శాంతకుమారి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమ కోర్సుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని సూక్ష్మ పోషకాల ప్రాధాన్యతను వివరించారు. పంటలకు స్థూల పోషకాలు ఎంత అవసరమో... సూక్ష్మ పోషకాలు కూడా అంతే అవసరమని తెలిపారు.పోషక లోపాలు ఏర్పడినప్పుడు వివిధ పంటల్లో ఏర్పడే లక్షణాలను వివరించారు. పోషకలోపాలను సకాలంలో నివారించుకోకపోతే దిగుబడులు తగ్గే అవకాశం కూడా ఉందని వివరించారు. పోషక లోపాలు ఏర్పడినప్పుడు రైతులు చీడ, పీడలుగా భావించి పురుగుమందులు పిచికారీ చేసి నష్టపోతుంటారని తెలిపారు. పోషక లోపాలను సకాలంలో గుర్తించి వాటిని సరి చేసుకోవడం ద్వారా దిగుబడులపై ప్రభావం పడకుండా చేసుకోవచ్చని సూచించారు. విశ్రాంత జేడీఏ, దేశీ కార్యక్రమ సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ... రైతులు ప్రతి అవసరానికి ఇన్‌పుట్ డీలర్ల దగ్గరకే వస్తుంటారని, వారికి చక్కటి సలహాలు ఇచ్చి సహకరించాలని సూచించారు. అనంతరం దేశీ శిక్షణం కార్యక్రమం ద్వారా నేర్చుకున్న వాటిపై ఇన్‌పుట్ డీలర్లకు క్విజ్ నిర్వహించారు. కార్యక్రమంలో 40 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

# క్లాప్ డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక నాయకులు

కర్నూలు(సెంట్రల్): చెత్త సేకరణ ఆటోల (క్లాప్)డ్రైవర్లను విధుల్లోకి తీసుకొని వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించాలని వివిధ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవనంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు ఆర్.నరసింహులు, ఓల్డ్‌సిటీ అధ్యక్షుడు అబ్దుల్‌దేశాయ్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గురుశేఖర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద బాబు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్, ఆటో యూనియన్ నాయకుడు కె.ప్రభాకర్, సీఐటీయూ ఓల్డ్‌సిటీ నగర కార్యదర్శి మారేళ్ల విజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎండీ అంజిబాబు మాట్లాడుతూ..క్లాప్ డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న 9 నెలల జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. అగ్రిమెంట్ ప్రకారం నెలకు రూ.18,500 వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలన్నారు.

### క్రీడల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి ఎస్. జాకీర్ హుస్సేన్ అన్నారు. ఆదివారం స్థానిక ఏ.క్యాంపులోని మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో సీనియర్ సాఫ్ట్‌బాల్ బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎంపికయిన క్రీడాకారులు ఈనెల 16 నుంచి 18 వరకు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో నిర్వహించనున్న 10 వ రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

### 3న బ్లాక్ డేగా పాటించండి

కర్నూలు(సెంట్రల్): ఈనెల 3వ తేదీన బ్లాక్ డేగా పాటించాలని ఏపీ రైతు సంఘం నాయకులు జి.రామకృష్ణ, కె.జగన్నాథం ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఏడాది క్రితం ఉత్తరప్రదేశ్‌లోని లఖీంపూర్ ఘటనలో చనిపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ నిరసన తెలుపుతున్న రైతులపై కేంద్ర సహాయ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు వాహనాన్ని ఎక్కించి ముగ్గురి ప్రాణాలు తీశాడన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించనున్న బ్లాక్ డేను అన్ని మండలాల్లో రైతుల పాటించాలని కోరారు.

### ఉచిత వైద్య శిబిరం

కల్లూరు: కల్లూరు అర్బన్ 29వ వార్డులోని శ్రీ సూర్య నారాయణ స్వామి దేవాలయం ఫంక్షన్ హాల్‌లో ఆదివారం శ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి దివ్య ఆశీస్సులతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వైద్య సేవలను ప్రారంభించారు. వైద్య శిబిరంలో సుమారుగా 1200 మందికి ఉచితంగా వైద్య చేసి మందులు పంపిణీ చేశారు. వైద్య సేవలు అందించిన వైద్యలకు అనఘా దత్త జ్ఞానబోధ సభ ట్రస్టు తరపున శ్రీ టీఎస్ రామకృష్ణ, శ్రీదేవి దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

### సమస్యలను పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్) : రెండో వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.షరీఫ్ కోరారు. ఆదివారం సీపీఎం బృందం రెండో వార్డులో పర్యటించింది. పలు కాలనీల్లో రోడ్లపైనే చెత్త ఉందని, మంచినీళ్లు దుర్వాసనగా వస్తున్నాయని చెప్పారు. మునిసిపల్ అధికారులు స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలన్నారు.

### రేపు డబ్ల్యూఎఫ్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు(సెంట్రల్): అక్టోబర్ 3వ తేదీన డబ్ల్యూఎఫ్‌టీయూ (వరల్డ్ ఫెడరేషన ఆఫ్ ట్రేడ్ యూనియన్) ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, దీనిని జయప్రదం చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎండీ అంజిబాబు, ఎస్.మునెప్ప కోరారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..ప్రపంచ వ్యాప్తంగా కార్మిక హక్కుల కోసం పోరాడి అశువులు బాసిన వారిని స్మరిస్తూ కార్మిక పోరాటాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 3న కలెక్టరేట్ ఎదుట మానవహారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే అదే రోజు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### శ్రీశైలంలో ట్రాఫిక్ జామ్

శ్రీశైలం: వరుస సెలవులు ఉండటంతో వందల సంఖ్యలో భక్తులు వాహనాల్లో తరలి రావడంతో శ్రీశైలంలో ఆదివారం ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. శ్రీశైలం డ్యాం నుంచి ప్రారంభమై ట్రాఫిక్‌ను నియంత్రించడానికి గంటల కొద్ది సమయం పట్టింది. అంతర్గత రహదారుల వద్ద గేట్లు మూసివేయడంతో వాహనాలను భక్తులు ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియక అయోమయానికి గురయ్యారు.

# ఉపాధ్యాయులు వృత్తి ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించాలి

- తెలంగాణ జాతీయ సాహిత్య పరిషత్తు కార్యదర్శి మావుడూరు సూర్యనారాయణ



సమ్మేళన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు



హాజరైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు

కర్నూలు కల్చరల్: ఉపాధ్యాయులు తమ వృత్తి ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించాలని తెలంగాణ జాతీయ సాహిత్య పరిషత్తు కార్యదర్శి మావుడూరు సూర్యనారాయణ అన్నారు. వికాస భారతి ఆధ్వర్యంలో ఆదివారం నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఉపాధ్యాయుల, కళాశాల అధ్యాపకుల సమ్మేళనం జరిగింది. 'భావి తరాలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంలో మన పాత్ర' అనే అంశంపై ఆయన మాట్లాడారు. విద్యార్థి సర్వతో ముఖావృద్ధిలో ఉపాధ్యాయుని పాత్ర కీలకమైందన్నారు. దేశానికి, సంస్కృతికి జవాబుదారీగా ఉండేలా విద్యార్థులను తయారు చేయాలన్నారు. దేశ భక్తి, దేశ రక్షణ, పురాణ ఇతిహాసాలు తదితర అంశాలకు సంబంధించిన పాఠ్యాంశాలు బోధించాల్సిన అవసరం ఉందన్నారు. 'సాంస్కృతిక కాలుష్యం' అనే అంశంపై వికాస భారతి సంఘటనా కార్యదర్శి నాగేంద్ర ప్రసాద్ మాట్లాడారు. పెడ పోకడలతో మన సంస్కృతి, సంప్రదాయాలను కలుషితం చేస్తున్నారన్నారు. కుటుంబ వ్యవస్థ, బంధాలు అనుబంధాలను చిన్న తనం నుంచే పిల్లలకు తెలియ జేయాలన్నారు. మహనీయుల త్యాగాలు జీవిత చరిత్రలను వివరించాలన్నారు. కార్యక్రమంలో దేశం చేసిన త్యాగాలను, అభివృద్ధి పాఠ్యాంశాల్లో తెలపాలన్నారు. భారతీయ స్ఫూర్తి కేంద్రం అధ్యక్షుడు జి.హుసేన్‌రెడ్డి, వైస్ చైర్మన్ జి.మోహన్‌రెడ్డి, తెలుగు భాషా వికాస ఉద్యమం జేఎస్‌ఆర్కే శర్మ, సురభి గోశాల ప్రధాన కార్యదర్శి పి.మహేశ్వరరెడ్డి, వివేకానంద కేంద్ర వ్యవస్థాపక ప్రముఖ్ శివప్రసాద్, గడివేముల రాజరాజేశ్వరి పాఠశాల, విజయానికేతన్ పాఠశాలల కరస్పాండెంట్‌లు రామేశ్వరరావు, విజయకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఫణికుమార్

కర్నూలు(సెంట్రల్) : 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఫణికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో 104 ఉద్యోగుల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..104 ఉద్యోగులను ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలన్నారు. ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలన్నారు. సకాలంలో వేతనాలు చెల్లించి జీతభత్యాలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అనంతరం రెండు జిల్లాలకు నూతన కార్యవర్గాలను ఆయన ప్రకటించారు. కర్నూలు జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా కృష్ణారెడ్డి, పెద్దయ్య, నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా జగదీష్, హుస్సేన్ వలీలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

# తొలి రోజు 81.37 శాతం పింఛన్ల పంపిణీ



గురురాఘవేంద్రనగర్‌లో వృద్ధురాలికి పెన్షన్ ఇస్తున్న వలంటీర్ రాజశేఖర్

కర్నూలు (టౌన్): వైఎస్ఆర్ పెన్షన్ కానుకను తొలిరోజు కర్నూలు నగరంలో 81.37 శాతం మందికి పంపిణీ చేశారు. ఆదివారం ఉదయం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేశారు. నగరంలోని 136 సచివాలయాల పరిధిలో అన్ని రకాల పెన్షన్లు 34, 067 ఉన్నాయి. వీరికి నెలకు రూ. 9,59,02,500 పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఆదివారం ఒక్క రోజే రూ.7,80, 32,500 పంపిణీ చేసినట్లు నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ వెల్లడించారు. మరో రెండు రోజుల్లో 100 శాతం మందికి పెన్షన్ పంపిణీ చేస్తామని తెలిపారు.

# ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి



మేయర్ బీవై రామయ్యతో వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిమూలపు సతీష్

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్యను పార్టీ వైద్య విభాగం (డాక్టర్స్ వింగ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిమూలపు సతీష్, ఇతర ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా మేయర్ రామయ్య మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం వైద్య విభాగం కమిటీ మరింత బాగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య పరంగా తీసుకుంటున్న చర్యలు, పేదల ఆరోగ్యం కోసం చేస్తున్న ఖర్చు, ఆసుపత్రుల అభివృద్ధి, మెడికల్ కళాశాలల మంజూరు, ఫ్యామిలీ డాక్టర్, ఇంటింటి సర్వే, అర్బన్ హెల్త్ సెంటర్లు, విలేజ్ క్లినిక్ వంటి వాటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాని చెప్పారు. ఈ ప్రణాళికతో ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆదిమూలపు సతీష్ పేర్కొన్నారు. అనంతరం కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిని కలిసిన వారిలో జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ హరికృష్ణ కిశోర్‌రెడ్డి, పార్టీ నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి ఉన్నారు.

### లక్ష్మారెడ్డి సేవలు చిరస్మరణీయం



లక్ష్మారెడ్డి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న డీటీఎఫ్ నాయకులు

కర్నూలు సిటీ: డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ లక్ష్మారెడ్డి ఉపాధ్యాయుల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని ఆ సంఘం జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు సోమశేఖర్ శర్మ, జిల్లా అధ్యక్షుడు కరె్ర క్రిష్ణ అన్నారు. ఇటీవలే మరణించిన డీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మారెడ్డి సంస్మరణ సభను శనివారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో వారితో పాటు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ య్య పాల్గొని లక్ష్మారెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు విరసం నేత పినాకపాణి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాసరావు, గట్టు తిమ్మప్ప, రత్నం ఏసేపు పాల్గొన్నారు.